ఓవైపు వృథా.. మరోవైపు కటకట

● తాగునీటి పైపులైన్ లీకేజీపై నిర్లక్ష్యం

దుగ్గొండి : అసలే వేసవి కాలం. భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. జలాశయాల్లో నీరు నామ మాత్రంగానే ఉంది. ఈ తరుణంలో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలకు అధికారులను ఆదేశించింది. ఇదిలా ఉండగా ఓవైపు నీరు వృథా పోతుండగా మరోవైపు నీటి కటకట నెలకొంది. ఈ పరిస్థితి మండలంలోని నాచినపల్లిలో నెలకొంది. వివరాలిలా..

నాచినపల్లిలో 955 నివాసాలుండగా గ్రామానికి నీటిని సరఫరా చేసేందుకు 2 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌లు ఉన్నాయి. గ్రామాన్ని రెండు భాగాలుగా విభజించి నీరు అందిస్తున్నారు. పద్మశాలీ వీధిలో గిర్నిబావి-నాచినపల్లి-పానకల్ ప్రధాన రహదారి పక్కన మూడు నెలల క్రితం తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో నాటి నుంచి తాగునీరు రోడ్డుపై కాల్వను తలపించేలా వృథా పోతోంది. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. ఇక మరోవైపు ఉన్న 450 నల్లాలకు సరిపడా నీరందని దుస్థితి నెలకొంది. రోజు విడిచి రోజు నీరు అందిస్తున్నారు. ఒక్కో ఇంటికి 100 లీటర్లకు మించి నీరు అందడం లేదు. 100 లీటర్ల నీటిని రెండ్రోజులు సర్దుకోవడం చాలా ఇబ్బందిగా ఉంటోందని మహిళలు వాపోయారు. అధికారులు సత్వరమే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పద్మశాలీ వీధిలో రోడ్డుపై ప్రవహిస్తున్న తాగునీరు

నెలలుగా నిర్లక్ష్యం



పద్మశాలి వీధిలో నెలలుగా నల్లా ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. రోజూ నీరు వృథా పోతుండడంతోపాటు మురుగు పేరుకుపోయి బురదమయం అవుతోంది. జనావాసాల్లోనే ఉండడంతో దోమలు ప్రబలుతున్నాయి. పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

\- కోట రాము, గ్రామస్తుడు

సమస్యను పరిష్కరిస్తాం



గ్రామంలోని తాగునీటి పైపులైన్ లీకేజీ సమస్యను పరిశీలించి సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతా. బావులను అద్దెకు తీసుకుంటున్నాం. అందరికీ సరిపడా నీరందించే ఏర్పాట్లు చేస్తాం.

\- మోడెం శ్రీధర్, ఎంపీఓ

రజతోత్సవ సభకు ఘనంగా ఏర్పాట్లు

● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి శ్రేణులు, రైతులు, ప్రజలను తరలించడానికి ఘనంగా ఏర్పాట్లు చేసినట్టు స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఏరి కోరి తెచ్చుకుంటే రైతులను నట్టేట ముంచుతోందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగం చితికిపోయిందని, రైతులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. రజతోత్సవ సభకు పార్కింగ్ మ్యాప్‌తోపాటు మ్యాపులు ఏర్పాటు చేశామని, టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి సమాచారం అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. సభకు ఆర్టీసీ బస్సులు, డీసీఎం, ద్విచక్ర వాహనాలు, ప్రైవేటు వాహనాలతో సుమారు 26 వేల మందికిపైగా నియోజకవర్గ ప్రజలను తరలిస్తామన్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో పది లక్షల చొప్పున మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిల్లు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో రైతు సమన్వయ సమితి రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ రామస్వామి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

పథకాలపై అవగాహనతోనే పార్టీ బలోపేతం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గురుమూర్తి

వర్ధన్నపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తూ బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గురుమూర్తి శివ శ్రేణులకు సూచించారు. పట్టణంలోని భారతీయ నాటక కళాసమితి ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి బీజేపీ మండల అధ్యక్షురాలు కొండేటి అనిత సత్యం అధ్యక్షత వహించగా గురుమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండల కమిటీ విస్తరణ దిశగా మండలంలోని అన్ని గ్రామాల్లో వివిధ పదవులకు అర్హులను ఎంపిక చేసి జిల్లా కమిటీకి పంపించినట్టు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలపై చైతన్యవంతం చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు కొండేటి సత్యం, రాయపురపు కుమారస్వామి, మైస రాము, బోయినపెల్లి దేవేందర్‌రావు, పెద్దూరి రాజ్‌కుమార్, అనిల్, సోమిరెడ్డి, నాలం సాయిలు, సిందం శ్రీనివాస్, రాజేందర్, సంపత్, దేవేందర్, గిరి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గురుమూర్తి

గరిబోళ్ల బస్తీలో వసతులు కల్పించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నర్సంపేటకు చెందిన మహిళలు

వరంగల్ : నర్సంపేటలోని వరంగల్ రోడ్డులోని అంబేడ్కర్‌నగర్, గరిబోళ్ల బస్తీలో మౌలిక వసతులు కల్పించాలంటూ ఆయా కాలనీలకు చెందిన మహిళలు వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి వచ్చి కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ నాయకులు మందకుమార్ మాదిగ, పుట్ట రవిమాదిగ, కల్లెపెల్లి ప్రణయ్‌దీప్ మాదిగ మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం నర్సంపేట టౌన్‌లో ఇళ్లు లేని వారంతా ప్రజాస్వామిక పోరాట సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ నగర్, గరీబోళ్ల బస్తీ పేరు పెట్టుకుని 205గుడిసెలు వేసుకుని అసౌకర్యాల నడుమ జీవిస్తున్నారని తెలిపారు. వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వంట గ్యాస్ ధర పెంపు సరికాదు

● సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రమేశ్

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచడం సరికాదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ అన్నారు. ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన ధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. వంట గ్యాస్, ఇతర నిత్యావసరాల ధరలు పెంచి పేదలపై భారాలు మోపుతూనే కార్పొరేట్ సంస్థలకు కోట్లాది రూపాయల రాయితీ ఇస్తున్నారని ధ్వజమెత్తారు. వంట గ్యాస్, ఇతర ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంపెల్లి మునీశ్వర్, అక్కపెల్లి రమేష్, మండల కార్యదర్శి గడ్డం యాకయ్య, నాయకులు ఇల్లందుల సాంబయ్య, గడ్డం నాగరాజు, శైలజ, మంజుల, శ్రీకళ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మండల కార్యదర్శి ఆరెల్లి రవి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలు పెంచడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం రవాణా రంగానికి కీలకమైన ఇంధనంపై ధరలు పెంచితే అత్యవసర వస్తువుల ధరలు పెరుగుతాయని తెలిపారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండేటి రామకృష్ణ, గొడిశాల బిక్షపతి, ఎలుమకంటి వేణు, కొండేటి శ్రీకాంత్, నాంపెల్లి మహేందర్, ఆరోగ్యం, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆలయ నిర్మాణ అనుమతి రద్దు చేయండి'

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట ఊర చెరువు సమీపంలో తలపెట్టిన పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని కోరుతూ ఆ గ్రామ గిరిజన రైతులు తహసీల్దార్ ఫణికుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడారు. ఊర చెరువు సమీపంలోని పొలంతోపాటు బోడును బుడిగె నర్సయ్య అనే రైతు నుంచి తాము కొనుగోలు చేశామని, అందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఆలయ నిర్మాణం చేపట్టకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు భూక్య మాన్‌సింగ్, నర్సింహ, భూక్య ఈర్య, భూక్య శ్రీనివాస్, భద్రు, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నర్సంపేట/నల్లబెల్లి/దుగ్గొండి : ఈనెల 27న హనుమకొండ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, మునిగాల వెంకట్‌రెడ్డి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్, బాల్నె వెంకన్న కోరారు. నల్లబెల్లి, నర్సంపేట, చెన్నారావుపేట, దుగ్గొండి మండలాల్లో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో వారు మాట్లాడారు. శ్రేణులను, ప్రజలను సభకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వాహనాలు, ఇతర సదుపాయాలు సిద్ధం చేసినట్టు తెలిపారు. చెన్నారావుపేట, దుగ్గొండి మండలాల్లో సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

మినీ పర్ణశాల అగ్నికి ఆహుతి

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలోని రిటైర్డ్ ఉపాధ్యాయుడు బొమ్మినేని తిరుపతిరెడ్డి-నిరంజనాదేవి నివాసంలోని పెరట్లో ఏర్పాటు చేసిన మినీ పర్ణశాల సోమవారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతైంది. వివరాలిలా.. తిరుపతిరెడ్డి దంపతులు వారి ఇంటి పెరట్లో భద్రచలంలోని తరమా మినీ పర్ణశాల నిర్మించారు. ఏటా శ్రీరామ నవమికి తిరుపతిరెడ్డి దంపతుల నివాసంలోని మినీ పర్ణశాల నుంచే సీతమ్మ తల్లిని వధువుగా అలంకరించి స్థానిక ఆలయానికి తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. కాగా సోమవారం తెల్లవారుజామున మంటలు ఎగసి పడుతుండగా స్థానికులు గమనించి తిరుపతిరెడ్డి దంపతులకు సమాచారం అందించారు. స్థానికులు, తిరుపతిరెడ్డి దంపతులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అప్పటికే 75 శాతం మేర దగ్ధమైంది. పర్ణశాలకు ఎవరైనా నిప్పు పెట్టారా? లేక విద్యుత్ ప్రమాదం జరిగిందా? అనే విషయం తేలాల్సి ఉంది.

'లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి'

వర్ధన్నపేట : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని మాదిగల ఐక్య సంక్షేమ సంఘం (మాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్ డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కాంగ్రెస్ నాయకులతో వేసిన కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన క్రమంలో పార్టీలకు అతీతంగా ఇండ్లు లేని పేదలను ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో నాయకులు జన్ను రాములు, జనగాం శ్రీనివాస్, ఈరెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.


శ్మశానవాటిక వద్దే మృతదేహం


గీసుకొండ : బతుకు దెరువు కోసం పదేళ్ల క్రితం మొగిలిచర్లకు వచ్చిన డీసీఎం డ్రైవర్ సాంపెల్లి శ్రీకాంత్ (40) ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందగా అయిన వారు, సొంత ఇల్లు లేకపోవడంతో శ్మశాన వాటిక వద్దే టెంట్ వేసి మృతదేహాన్ని ఉంచిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ఇచ్చిన రూ.5 వేలతోపాటు మొగిలిచర్ల వాసుల చందాలతో శ్రీకాంత్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.


యువకుడికి గాయాలు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సును విజయ్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వస్తూ ప్రమాదవశాత్తు వెనుక నుంచి ఢీకొట్టాడు. బైక్ ముందు భాగం నుజ్జునుజ్జు కాగా విజయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ ద్వారా విజయ్‌ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

అగ్నివీర్‌కు విద్యార్థుల ఎంపిక


నితిన్


వెంకటేశ్


సందేశ్

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌కు చెందిన డిగ్రీ విద్యార్థులు నితిన్, వెంకటేశ్, నందేశ్ అగ్నివీర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గట్ల సురేందర్ తెలిపారు. ఈ మేరకు వారిని స్కూల్/కళాశాల ఆవరణలో సోమవారం ఆయన అభినందించి మాట్లాడారు. గతంలో స్కూల్‌కు చెందిన 8 మంది ఎంపికయ్యారని తెలిపారు. భారత రక్షణ రంగంలో సేవలు అందించడానికి సైనిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాసస్వామి, ఉప్పలయ్య, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


నర్సంపేట : గర్భిణులకు సీమంతం చేస్తున్న ఆర్‌జేడీ లక్ష్మీబాయి, సీడీపీఓ మధురిమ, తదితరులు

● ఐసీడీఎస్ ఆర్‌జేడీ లక్ష్మీబాయి

నర్సంపేట/గీసుకొండ/పర్వతగిరి : పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ ఆర్‌జేడీ లక్ష్మీబాయి, సీడీపీఓలు మధురిమ, డెబోరా తెలిపారు. నర్సంపేటలోని రైతువేదికలో సోమవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ లక్ష్మీబాయి, సీడీపీఓ మధురిమ, ఎంఓ భావన, ఎంపీడీఓ శ్రీనివాస్ కుమార్ మాట్లాడారు. గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లి, పర్వతగిరి మండలంలోని టూక్యాబాజుతండా అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సీడీపీఓ డెబోరా మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. గర్భిణుల నమోదు, బరువు, ఎత్తు, పోషకాహారం తీసుకునే విషయమై తెలిపారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు.

సంగెం : మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కాపులకనపర్తి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లిబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పోషకాహార లోపం చిన్నారుల మానసిక ఎదుగుదలపై దుష్ప్రభావం చూపుతుందని చెప్పారు. రక్తహీనత రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ఏఐతో అభ్యసనా సామర్థ్యాల పెంపు


నర్సంపేట రూరల్ : కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ సారయ్య


నల్లబెల్లి : పిల్లల ఆటలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నర్సింహమూర్తి, హెచ్‌ఎంలు, తదితరులు

● ఎంఈఓ కొర్ర సారయ్య

నర్సంపేట రూరల్ : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంపొందుతాయని ఎంఈఓ కొర్ర సారయ్య తెలిపారు. నర్సంపేట మండలలలోని గురిజాల జెడ్పీ సెకండరీ స్కూల్‌లో ఏఐ, ఏఎక్స్ఎల్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు సంపూర్ణ విషయ పరిజ్ఞానం అందించడంలో కంప్యూటర్ ల్యాబ్ ఉపకరించనుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అర్పిత, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలోని నారక్కపేట ప్రైమరీ స్కూల్‌లో డిజిటల్ అక్షరాస్యత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాఠ్యాంశాల పరిచయ కార్యక్రమాన్ని ఎంపీడీఓ నర్సింహమూర్తి ప్రారంభించి మాట్లాడారు. ప్రీ ప్రైమరీ విద్యావిధానంతో పిల్లల్లో మేధాశక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రైమరీ, హైస్కూళ్ల హెచ్‌ఎంలు సదానందం, సుధాకర్, గుండ్లపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఉషశ్రీ, ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, వెంకటరమణ, నర్సయ్య, భిక్షపతి, సౌందర్య, వేణుగోపాల్, యుగంధర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● ఎంఈఓ రాము

సంగెం : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ రాము స్పష్టం చేశారు. మండలంలోని ఎల్గూర్ స్టేషన్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎల్గూర్ స్టేషన్, జాటోత్ తండాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు ఉపాధ్యాయులతో కలిసి ఆయన వెళ్లి బడిబాటపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న సౌకర్యాలను వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవేందర్‌రావు, ఉపాధ్యాయులు కుమారస్వామి, ఏకాంబరం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ అనిత, సీఆర్పీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఓ రాము

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

● పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్, ఎస్‌ఓ నీరజ

పర్వతగిరి : ప్రభుత్వం పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్, మండల ప్రత్యేక అధికారి (ఎస్‌ఓ) నీరజ తెలిపారు. మండలంలోని వడ్లకొండలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం మద్దతు ధరతోపాటు సన్న ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తోందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మధుసూదన్ రావు, తదితరులు పాల్గొన్నారు.


పర్వతగిరి : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ దేవేందర్, ప్రత్యేక అధికారి నీరజ

సదుపాయాలు కల్పించాలి

నర్సంపేట : పట్టణంలోని అంబేడ్కర్ నగర్ గుడిసె వాసులకు మౌలిక వసతులు కల్పించాలని డీబీడీపీఎస్ ప్రజాదండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు అందె రవి ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జాతీయ ప్రతినిధి ప్రణయ్‌దీప్ అధ్యక్షతన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 28వ రోజుకు చేరుకోగా రవి మాట్లాడారు. తాగునీటి, రోడ్లు, డ్రైయినేజీ, తదితర వసతులు కల్పించి ఇంటి నంబర్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీక్షలో నాయకులు జలగం రమేష్, ఉప్పలయ్య, రాము, చారి, రవి, వేణు, విజయ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

'సొంత జిల్లాలో సీటివ్వాలి'

వర్ధన్నపేట : గురుకుల స్కూళ్లకు ఎంపికైన విద్యార్థులకు సొంత జిల్లాలోనే సీటు ఇవ్వాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ డిమాండ్ చేశారు. మండలంలోని ఉప్పరపల్లి క్రాస్‌లోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో సోమవారం ఆయన మాట్లాడారు. నిర్మల్, భైంసా, తదితర జిల్లాలకు చెందిన వారికి సీటివ్వడంతో తెల్లవారుజామునే అడ్మిషన్ రిపోర్టు చేయడానికి వచ్చారన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా సీఎం, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకుని గురుకులాల కార్యదర్శులకు దిశానిర్దేశం చేస్తూ ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ట్విట్టర్ ద్వారా లేఖ రాసినట్టు తెలిపారు.

క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన రాణాప్రతాప్‌రెడ్డి



నర్సంపేట : కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి కరీంనగర్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని రాణాప్రతాప్‌రెడ్డికి సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తాచాటేలా చేపట్టాల్సిన కార్యాచరణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొంకీస విఘ్నేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సన్మానం



నెక్కొండ : జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా 20వ ర్యాంక్ సాధించిన విద్యోదయ స్కూల్ పూర్వ పదో తరగతి విద్యార్థి ఆంగోతు వేణును ఆ స్కూల్ కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగార్జున్‌రెడ్డి మాట్లాడారు. నిరుపేద గిరిజన విద్యార్థి వేణు గోల్ సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విద్వాన్ కళాశాల డైరెక్టర్లు బందు వెంకట్, శోభన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గోపి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి బాల సంస్కార్-2025

పర్వతగిరి : మండలంలోని కల్లెడ శ్రీసన్నకొలను వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 27 నుంచి మే 11వ తేదీ వరకు 4 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న బాలలకు బాల సంస్కార్-2025 కార్యక్రమం నిర్వహిస్తామని శ్రీరామకృష్ణ సేవా సమితి, సహృదయ సేవా సమితి, కల్లెడ స్వయం సేవిక బాధ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులకు యోగా, ధ్యానం, నైతిక విలువలు పెంచే కథలు, పద్యాలు, ప్రేరణాత్మక కథలు, కవితలు, ఆటలు, ఆకర్షణీయమైన చేతిరాత, చిత్రలేఖనం, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు వివరించారు. శిక్షణ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేస్తుందని స్పష్టం చేశారు. శిక్షణ రుసుము రూ.500 చెల్లించాలని, నూరు శాతం శిక్షణ తరగతులకు హాజరైన బాలలకు రుసుము తిరిగి అందజేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9949075955, 9440427968, 9959001511ల్లో సంప్రదించాలని కోరారు.

'అంబేడ్కర్' సంఘం కమిటీ ఎన్నిక

దుగ్గొండి : మండలంలోని ముద్దునూరులో అంబేడ్కర్ యువజన సంఘం కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఇనుగాల కృష్ణారెడ్డి, సలహాదారులుగా బొల్లెపల్లి రాము, గురిమిళ్ల రవి, అధ్యక్షుడుగా చింత కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా గురిమిళ్ల నిఖిల్, కోయిల అశోక్, ప్రధాన కార్యదర్శిగా గురిమిళ్ల శ్రీవర్ధన్, సహాయ కార్యదర్శిగా రేవూరి గోపాల్‌రెడ్డి, కోశాధికారిగా బొల్లెపల్లి వెంకన్న, కార్యవర్గ సభ్యులుగా కోయిల సాంబయ్య, బాబు, గురిమిల్ల దేవేందర్, జ్ఞానం విజయ్, బూస చేరాలు, మోటపోతుల కృష్ణ, వావిళ్ల శ్రీను, కన్నెబోయిన మహేష్, వేములపల్లి దశరథం, ఎనుగంటి అంజిత్, వడ్డెపల్లి రాజన్న, ప్రభాకర్, హరిశంకర్ ఎన్నికయ్యారు.

'భూభారతి'పై నేడు సదస్సు

ఖానాపురం : భూభారతి పోర్టల్‌పై అవగాహన కల్పించేందుకు నేడు (మంగళవారం) మండల కేంద్రంలోని రైతువేదికలో సదస్సు నిర్వహిస్తామని తహసీల్దార్ కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సందేహాలను నివృత్తి చేసుకునే దిశగా రైతులు, అన్ని తరగతుల ప్రజలు హాజరు కావాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి, ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్ సత్యశారద సహా పలువురు ప్రముఖులు హాజరవుతారని వివరించారు.

నివాళి

పర్వతగిరి : మండలంలోని ఏబీతండా మాజీ సర్పంచ్ గోపి సమీప బంధువు ముత్తమ్మ ఆదివారం మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ వేర్వేరుగా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, ఐనవోలు ఆలయ కమిటీ డైరెక్టర్ బందెల వెంకన్న, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మాలోతు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.